సాక్షి
ప్రకాశం
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



అతిథులు వచ్చేశాయ్..!
ఏటా వేసవిలో యూరప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, ఆసియాలోని పలు దేశాల నుంచి జరుగుమల్లికి వచ్చే వలస జాతి పక్షులు ప్రస్తుతం సందడి చేస్తున్నాయి. - 8లో..



గోవా మద్యం పట్టివేత
చిన్నకంభంలోని ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన గోవా మద్యాన్ని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/26

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

తిరకాసు పోస్టులు

ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ పోస్టులను హాట్‌కేకుల్లా అమ్మేస్తున్నారు. జిల్లాలోని పలు ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు బరి తెగించి సంతలో సరుకుల్లా వేలం పెట్టి మరీ విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని 21 పాఠశాలల్లో 74 పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పోస్టును బట్టి రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షలు వరకూ వసూలు చేశారని, దీనికి కొంతమంది అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

- ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో యాజమాన్యాల దోపిడీ
- పోస్టును బట్టి ముందే రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకూ వసూలు
- ఆన్‌లైన్ పరీక్ష వద్దంటూ కోర్టులకు
- నిలిచిపోయిన ప్రక్రియ
- జిల్లా వ్యాప్తంగా 140 ఎయిడెడ్ పాఠశాలలు
- 205 మంది మిగులు ఉపాధ్యాయులు
- జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలలకు నోటీసులెక్కడా..?



ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలలు 140 ఉన్నాయి. వీటిల్లో 613 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అందులో సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలు 40 ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 205 మంది మిగులు టీచర్లు ఉన్నారు. అయితే 21 ఎయిడెడ్ పాఠశాలల్లో 74 పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గత ఏడాది డిసెంబరులో ఆయా పాఠశాలల్లో నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ ఇక్కడే తిరకాసు ఉంది. కేవలం పేపర్ ప్రకటనల్లో మాత్రమే పోస్టులు చూపించారు. లోలోపల మాత్రం ముందుగానే అభ్యర్థులను ఎంపిక చేసుకుని వారి నుంచి ఒక్కో అభ్యర్థి వద్ద రూ.15 నుంచి రూ.20 లక్షలు వసూలు చేశారని సమాచారం.

ఆన్‌లైన్ వద్దంటూ కోర్టుకి..
ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తే వారి ఇష్టానుసారంగా నచ్చిన వారికి పోస్టులు కట్టబెట్టే అవకాశం ఉంది. అదే ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహిస్తే కష్టంగా మారే అవకాశం ఉందని భావించిన ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు విడతల వారీగా కోర్టును ఆశ్రయించాయి. గతంలో 8 పాఠశాలలు, తాజాగా 13 పాఠశాలల యాజమాన్యాలు కోర్టుకెళ్లాయి. గిద్దలూరు సెయింట్ పాల్స్ ఎయిడెడ్ స్కూల్, హిందూ ఎయిడెడ్ (కొత్తపల్లి), చిత్తరంజన్ అరబిక్ పాఠశాల (కనిగిరి), వీసీపీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల (వెంకటరెడ్డి పల్లి), కేఎంఎయిడెడ్ ఉన్నత పాఠశాల (గుడిపాటి పల్లి), ఎబీఎం ఎయిడెడ్ హైస్కూల్ (ఒంగోలు), ముప్పవరం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల (జె.పంగులూరు), ఎమ్మెస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల రామకృష్ణాపురం (చీరాల) తదితర పాఠశాలల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. అలాగే తాజా 13 ఎయిడెడ్ పాఠశాలలు కోర్టుకెళ్లాయి.

ఎస్‌బీఎస్‌ఆర్ ఎయిడెడ్ పాఠశాల (కొమరోలు), సెయింట్ జాకబ్ ఎయిడెడ్ పాఠశాల (ముండ్లపాడు), హిందూ ఎయిడెడ్ పాఠశాల (గిద్దలూరు), శ్రీ శ్రీనివాస ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల (రావిపాడు), శ్రీరంగరాజన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల (కంభం), ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల (రాజుపాలెం), అంబేడ్కర్ ఎయిడెడ్ ఓరియంటల్ పాఠశాల (కనిగిరి), జీఎస్‌ఎస్‌టీ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల (కరేడు), లూథరన్ ఉన్నత పాఠశాల (తర్లుపాడు), ఏకే మెమోరియల్ రెసిడెన్సీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల (చెరుకూరు), ప్రకాశం ఎయిడెడ్ పాఠశాల (అద్దంకి), ఏబీఎం ఎయిడెడ్ పాఠశాల (బేస్తవారిపేట), నీలం జేమ్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల (చీరాల) ఎయిడెడ్ పాఠశాలలు కూడా తమ పాఠశాలల్లోని 38 పోస్టుల భర్తీకి ఇటీవల కోర్టుకు వెళ్లాయి.

మూతపడిన ఎయిడెడ్ పాఠశాలలకు నోటీసులు
పిల్లలు లేక మూతపడిన ఎయిడెడ్ పాఠశాలలకు జిల్లా విద్యాశాఖాధికారులు నోటీసులు ఇస్తున్నారు. సింగరాయకొండ ఎస్‌వీ ఎయిడెడ్ స్కూల్, ఒంగోలులోని జగ్జీవన్‌రాం ఎయిడెడ్ యూపీ స్కూల్ 2021లో, దశరాజుపల్లి ఎయిడెడ్ పాఠశాలను 2015లో, ఒంగోలులోని సీతారామపురం ఎయిడెడ్ స్కూల్‌ను 2016లో, రాచవారిపాలెం ఎయిడెడ్ స్కూల్‌ను 2021లో, కనిగిరిలోని ఎబీఎం ఎయిడెడ్ స్కూల్‌ను 2021 లో మూసివేశారు. విచిత్రమేమంటే పిల్లలు లేక, ఉపాధ్యాయులు రిటైర్ అయ్యి ఇలా ఏదో ఒక కారణంతో మూతపడిన ఎయిడెడ్ పాఠశాలలకు జిల్లా విద్యాశాఖాధికారులు నోటీసులు ఇవ్వడంతో ఉపాధ్యాయులు అవాక్కవుతున్నారు. అలాగే ఎయిడెడ్ స్కూల్లో మిగులు ఉపాధ్యాయులు ఉండి, పిల్లలు లేని ఎయిడెడ్ స్కూల్స్‌కు నోటీసులు ఇవ్వకపోవడం గమనార్హం.

ఆ పాఠశాలలకు నోటీసులెక్కడా..?
టీచర్లు ఉండి జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలలకు అధికారులు నోటీసులు ఇవ్వకపోవడం గమనార్హం. జిల్లాలో యర్రగొండపాలెంలోని డీఎంబీసీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 8 మంది ఉపాధ్యాయులు, మార్కాపురం శారదా ఎయిడెడ్ స్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయులు, దొనకొండ ఇందిరాగాంధీ ఓరియంటల్ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు, మార్కాపురం ఎబీఎం హైస్కూల్‌లో ఐదుగురు, గిద్దలూరు వివేకానంద ఎయిడెడ్ హైస్కూల్‌లో ఐదుగురు, జీవీఎస్ ఎయిడెడ్ హైస్కూల్‌లో ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. సమావేశం హైస్కూల్‌లో ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. వీటిల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్నా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు.

పోస్టును బట్టి డబ్బు వసూలు
పశ్చిమ ప్రకాశంలోని ఒక ఎయిడెడ్ పాఠశాల, ఒంగోలులోని ఒక ఎయిడెడ్ పాఠశాలలో పోస్టులు వేలానికి పెట్టారు. ఒక్కో పోస్టును బట్టి రూ.15 లక్షల నుంచి రూ.32 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. పరీక్ష నామమాత్రంగానే ఉంటుందని పోస్టింగ్ ఇచ్చే బాధ్యత మాదేనంటూ భరోసా ఇచ్చి ముందే డబ్బులు వసూలు చేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుకు రూ.15 లక్షలు నుంచి రూ.20 లక్షల వరకు, స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు, పీఈటీ పోస్టుకు రూ.20 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు ఆయా అభ్యర్థులు చెబుతున్నారు. దీనికి విద్యాశాఖలోని కొంత మంది అధికారులు వీరికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

> **ఆదేశాలు అందిన వెంటనే ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తాం**
> ఎయిడెడ్ యాజమాన్యాలు కోర్టుకు వెళ్లడంతో ఆన్‌లైన్ పరీక్ష వాయిదా వేశాం. విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తాం.
> – ఎ.కిరణ్‌కుమార్, డీఈఓ, ఒంగోలు

ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: సీతారాముల ప్రేమ, లక్ష్మణుడి విధేయత, భరతుడి త్యాగం, హనుమంతుడి భక్తి మీ జీవితంలో ప్రతిఫలించాలని కోరుకుంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ శ్రీరామనవమి మీ ఇంట్లో అందరికీ సుఖసంతోషాలను ఆరోగ్యాన్ని అందించాలని శ్రీరామచంద్రమూర్తి దయ మీ కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.

15లోపు అభ్యంతరాలు తెలపాలి

ఒంగోలు టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎఫ్ఎన్ఓ), శానిటరీ అటెండర్ కమ్ వాచ్‌మెన్ (ఎస్ఏడబ్ల్యూ) పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించేందుకు జనవరి 9 నుంచి 18 వ తేదీ వరకు దరఖాస్తు స్వీకరించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసిన వారి ప్రావిజినల్ లిస్టును ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టారన్నారు. ఈ జాబితాపై అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు స్వయంగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో తెలియజేయాలని, గడువు తరువాత ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించరని చెప్పారు. అలాగే నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా మార్కాపురం సర్వజన ఆస్పత్రిలోని మూడు స్టాఫ్ నర్సు పోస్టులకు నోటిఫికేషన్ ద్వారా గత ఏడాది డిసెంబర్ 30 నుంచి ఈ ఏడాది జనవరి 4వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారని తెలిపారు. ఈ పోస్టుల తాలూకు ప్రొవిజినల్ లిస్టును కూడా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పెట్టారని, ఈ లిస్ట్‌లో ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అభ్యంతరాలు తెలియజేయాలని, గడువు తరువాత ఎలాంటి అభ్యంతరాలను స్వీకరించరని తెలిపారు.

మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ

ఒంగోలు సిటీ: మెగా డీఎస్సీ–2025 పరీక్షల ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు ప్రకాశం జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్(ఈబీసీ) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఒంగోలు సంచాలకులు ఎం.అంజల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా టెట్‌లో అర్హత సాధించాలన్నారు. వివరాలకు 08592–231232, 9989285530, 8985090926 నంబర్లను సంప్రదించాలన్నారు.

జగ్జీవన్‌రాం ఆశయాలు కొనసాగించాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్పర్సన్ వెంకాయమ్మ
- వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు



జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరి రవిబాబు, డాక్టర్ వెంకయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సిటీ: దళిత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఒంగోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం 117 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రాం చిత్రపటానికి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డితో పాటు జెడ్పీ చైర్పర్సన్ వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, అనుబంధ సంఘాల నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ తొలి ఉప ప్రధానిగా జగ్జీవన్‌రాం అనేక సేవలు అందించారని కొనియాడారు. దళితులు, అణగారిన వర్గాల వారికి న్యాయ చేయడమే కాక, పేద ప్రజలకు సముచిత న్యాయం కోసం కృషి చేసిన సామాజికవేత్త అని కొనియాడారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ సంఘసంస్కర్త, సామాజిక న్యాయం కోసం పోరాడిన యోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం అని కొనియాడారు. జగ్జీవన్‌రాం వంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు. దళితుల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు దుంపా రమణమ్మ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు డి.క్రాంతికుమార్, పి.కోటేశ్వరరావు, ఎంపీపీ గాయం సావిత్రి, పేరం ప్రసన్న, రమణమ్మ, బడుగు ఇందిర, ఆసోది యలమందా రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డికి బెయిల్


జిల్లా జైలు నుంచి బయటకు వస్తున్న ఆంజనేయరెడ్డి

యర్రగొండపాలెం: త్రిపురాంతకం ఎంపీపీ పీఠాన్ని దక్కించుకునేందుకు టీడీపీ నాయకుల పన్నిన కుట్రకు బలై అక్రమ కేసులతో జైలుకెళ్లిన త్రిపురాంతకం మండల వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల ఆంజనేయరెడ్డికి శనివారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మండల పరిషత్ ఉప ఎన్నికలో ఎంపీపీగా పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్న ఆయన్ను తప్పించేందుకు కూటమి నాయకుడి పావులు కదిపిన విషయం జిల్లా ప్రజలకు తెలిసిందే. ఆయన ఆదేశాలతో గత నెల 23న ఆంజనేయరెడ్డిపై పోలీసులు అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు బనాయించి అరెస్టు చేశారు. ఈ మేరకు కోర్టు ఆంజనేయరెడ్డిని రిమాండ్‌కు పంపింది. ఎటువంటి సాక్ష్యాధారాలు లేకుండా పోలీసులు పెట్టిన అక్రమ కేసులను సవాల్ చేస్తూ ఆంజనేయరెడ్డికి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరఫు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. న్యాయమూర్తి ఆ పిటిషన్‌ను పరిశీలించి ఆంజనేయరెడ్డికి బెయిల్ మంజూరు చేశారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి


అల్లూరయ్య మృతదేహం

మార్కాపురం టౌన్: రైలు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మార్కాపురం రైల్వేస్టేషన్ ఔటర్ సిగ్నల్ వద్ద జరిగినట్లు హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణారెడ్డి తెలిపారు. మార్కాపురం మండలం పెద్దయాచవరం గ్రామానికి చెందిన వై.అల్లూరయ్య (55) శనివారం ఉదయం 10 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో ఔటర్ సిగ్నల్ వద్ద పట్టాల పక్కన చనిపోయి కనిపించాడు. మతిస్థిమితం లేక పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు హరికృష్ణారెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆడుకుంటూ..అనంత లోకాలకు!


మృతి చెందిన శివకాశి

మార్కాపురం: గుర్తుతెలియని కారు ఢీకొని బాలుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని తిప్పాయిపాలెంలో శనివారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన కోడే వెంకటేశ్వర్లు, కుమారిల కుమారుడు కోడే శివకాశి (10) ఆడుకుంటూ రోడ్డు దాటుతుండగా మార్కాపురం నుంచి కంభం వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తల్లిదండ్రులు వెంటనే హుటాహుటిన శివకాశిని కంభం వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు కంభంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో 2వ తరగతి చదువుతున్నాడు. కుమారుని మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున రోదించారు. అప్పటి వరకూ ఇంట్లో తమతో మాట్లాడి ఆడుతూ..పాడుతూ.. నిముషాల వ్యవధిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో కుటుంబంలో విషాదం నెలకొంది. రూరల్ ఎస్సై అంకమరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నేషనల్ హైవేపై ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా కారును గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అతిథులు వచ్చేశాయ్.!





ప్రతి ఏటా వేసవిలో యూరప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, ఆసియాలోని పలు దేశాల నుంచి జరుగుమల్లి వచ్చే ఎగ్రెట్ జాతి పక్షులు ప్రస్తుతం సందడి చేస్తున్నాయి. పెద్దసంఖ్యలో జంటలుగా వచ్చిన ఈ పక్షులు ఇక్కడి చెట్లపై ఎంతో ఆసక్తికరంగా గూళ్లు కట్టుకుని గుడ్లు పెట్టి పిల్లలను పొదుగుతున్నాయి. చుట్టుపక్కల చెరువులు, పొలాల్లో చేపలు, ధాన్యం గింజలు తెచ్చి పిల్లలకు అందించి పోషిస్తున్నాయి. పిల్లలకు రెక్కలొచ్చి ఎగిరే శక్తి రాగానే వాటిని తీసుకుని ఆయా దేశాలకు వెళ్లిపోతుంటాయి. మగ పక్షి ఎండు పుల్లలు తీసుకొచ్చి ఆడ పక్షికి అందిస్తుంటే.. ఆడ పక్షి గూడు కట్టి గుడ్లు పెట్టి పొదగడం, పిల్లలు పుట్టాక ఆహారం అందించడం వంటి దృశ్యాలు చూస్తూ పక్షి ప్రేమికులు మైమరిచిపోతున్నారు. ఈ పక్షులకు ఎటువంటి హానీ కలగకుండా గ్రామస్తులు కాపాడుతున్నారు.

– సాక్షి, ఒంగోలు













జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడవాలి


జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా


జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: సామాజిక న్యాయం, స్వాతంత్ర్యం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు, మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అడుగుజాడల్లో నడవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకల సందర్భంగా శనివారం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం మాట్లాడారు. ఆయన తన జీవితాన్ని సామాజిక న్యాయం, రైతుల సంక్షేమం, దేశ అభివృద్ధికి అంకితం చేశారన్నారు. అతి చిన్న వయస్సులోనే శాసన సభ్యులుగా ఎన్నికయ్యారని, 8 సార్లు పార్లమెంటు సభ్యులుగా కూడా పని చేశారన్నారు. కేంద్ర కార్మిక శాఖ, వ్యవసాయ శాఖ, రక్షణ శాఖ మంత్రిగా కూడా సేవలందించారన్నారు. మరణించే వరకూ దేశ సేవకు, సమాజ అభ్యున్నతి కోసం కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, జేసీ ఆర్ గోపాల కృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు, నగర మేయర్ గంగాడ సుజాత, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎన్ లక్ష్మానాయక్, నీలం నాగేంద్రరావు, ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, బిళ్లా చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఎస్పీ నివాళులు

ఒంగోలు టౌన్: బడుగు బలహీనవర్గాల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎస్పీ ఏఆర్ దామోదర్ కొనియాడారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎస్పీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలను జగ్జీవన్‌రామ్ అందించారని తెలిపారు. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అణగారిన ప్రజలకు సమాన హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. భారత రాజ్యాంగంలో సామాజిక న్యాయం అనే అంశాన్ని చేర్చడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. కార్మికుల హక్కులు, వ్యవసాయ రంగం అభివృద్ధి, విద్యారంగంలో సంస్కరణలు చేపట్టి మంచి పరిపాలనా దక్షకుడిగా పేరొందారని చెప్పారు. దేశ ప్రజల చేత బాబూజీగా కొనియాడబడుతున్న జగ్జీవన్‌రామ్ ఆలోచనలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, ఏఆర్ ఎస్సైలు పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

- ఇద్దరిపై బైండోవర్ కేసులు


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మార్కాపురం: మార్కాపురం ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శనివారం పెద్దదోర్నాల మండలం వైచెర్లోపల్లి అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించి నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి పిక్కిలి వెంకటేశ్వర్లును అరెస్టు చేశారు. మరో ఇద్దరు పాత నేరస్థులను దోర్నాల తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. వీరికి బెల్లం సరఫరా చేసిన వ్యాపారులపై కూడా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న కంభంలో గోవా మద్యం పట్టివేత

- 53 ఫుల్ బాటిళ్లు స్వాధీనం
- ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు


మద్యం సీసాలు, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

కంభం: మండలంలోని చిన్నకంభంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.బాలయ్య ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి నక్కా ప్రసాద్ అనే వ్యక్తి నివాసంలో అక్రమంగా నిల్వ ఉన్న గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నక్కా ప్రసాద్‌తో పాటు కర్నూల్‌కు చెందిన బెస్త హరికృష్ణ అనే మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి మాట్లాడుతూ హరికృష్ణ స్వస్థలం కర్నూలు కాగా అతను గోవాలో పనిచేస్తుంటాడు. వీరిరువు కలిసి గోవా మద్యం ట్రైన్‌లో తెచ్చుకొని ఇక్కడ విక్రయించుకుంటాడు. అందిన సమాచారం మేరకు శనివారం ఉదయం నక్కా ప్రసాద్ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 53 ఫుల్ బాటిల్స్ గోవా మద్యం దొరికిందని, ఇద్దరిని అదుపులోకి తీసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకొని అతనికి చెందిన ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని చెప్పారు. ఎవరైనా ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం విక్రయించినా, బెల్టుషాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

జోరుగా గోవా మద్యం వ్యాపారం

గిద్దలూరు నియోజకవర్గంలో గోవా మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. గోవా నుంచి ఓ కంటైనర్‌లో మద్యం వస్తోందని, గిద్దలూరు, రాచర్ల, కంభం, మార్కాపురం మీదుగా నరసరావుపేటకు వెళ్తున్నట్లు సమాచారం. కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాలకు కేంద్రంగా చిన్నకంభం ఉన్నట్లు తెలిసింది. ఫంక్షన్లు, ఇతర కార్యక్రమాలకు ఈ మద్యాన్ని ఎక్కువగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండు సార్లు ఎక్సైజ్ అధికారులు గోవా మద్యం స్వాధీనం చేసుకోగా అది చిన్న కంభం నుంచే సరఫరా అయినట్లు పోలీసులు గుర్తించారు. ఎక్సైజ్ అధికారులు గోవా మద్యం దొరికినప్పుడు కేసులు పెట్టి కోర్టుకు పంపడం.. కొన్ని రోజులకే నిందితులు తిరిగి వచ్చేస్తుండటంతో అక్రమ మద్యం వ్యాపారానికి అడ్డుకట్ట పడటం లేదు. గోవా మద్యం అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తూ జారిపడి ఏఎస్ఐ మృతి


ఏఎస్ఐ వేణుగోపాలరావు (ఫైల్)


వేణుగోపాలరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు శాఖలోని ఐటీ కోర్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ కె.వేణుగోపాలరావు ప్రమాదవశాత్తూ జారిపడి మరణించారు. శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో జారిపడి గాయాలవగా, వెంటనే స్థానిక ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున వేణుగోపాలరావు మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు అఖిల్, అలేఖ్య ఉన్నారు. వేణుగోపాలరావు భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామమైన నాగులప్పలపాడులోని నివాసానికి తరలించారు. సమాచారం తెలిసిన వెంటనే ఎస్పీ ఏఆర్ దామోదర్ నాగులుప్పలపాడు వెళ్లి వేణుగోపాలరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వేణుతో తనకు 17 ఏళ్ల అనుబంధం ఉందని, తాను ట్రైనీ డీఎస్పీగా జిల్లాకు వచ్చినప్పుడు ఐటీ కోర్ విభాగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటూ పలు కీలకమైన కేసుల్లో సేవలందించారని గుర్తు చేసుకున్నారు. అందుకే ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన్ను ఐటీ కోర్ విభాగంలో ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. ఎస్పీ వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ రాఘవేంద్ర, రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, నాగులుప్పలపాడు ఎస్ఐ శ్రీకాంత్, టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు


వివరాలు వెల్లడిస్తున్న కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కొండపి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసు నమోదైనట్లు కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. కొండపి మండలంలోని కే ఉప్పలపాడులో ఏడేళ్ల బాలికపై 50 ఏళ్ల వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. పచ్చాకు పనుల నిమిత్తం ముండ్లమూరు మండలం నుంచి కే ఉప్పలపాడు వచ్చిన కూలీలకు చెందిన బాలికకు చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చి మచ్చికచేసుకుని ఆ బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి కొండపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారించి పోక్సో కేసు నమోదు చేశారు. రెండు నెలలుగా ఇలా జరుగుతుండగా, బాలిక భయపడి బయటకు చెప్పలేదని విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై రౌడీషీట్ కూడా ఓపెన్ చేశామని చెప్పారు. విచారణలో కొండపి సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.